# ఎక్కడో పుట్టి....

-తుర్లపాటి పద్మజ.

**అనాధ శరణాలయంలో అనాధ పిల్లలందరికీ స్వీట్లు పంచుతోన్న మానస కొంగు పట్టుకొని తిరుగుతోన్న ఆ చిన్నారి సందీప్‌ని చూస్తూంటే నాకు ప్రపంచాన్ని జయించినంత తృప్తిగా ఉంది.**

నిజంగా నేను మళ్ళీ ఇలా మానసని చూస్తానని అనుకున్నానా? ఇంటికి రాగానే 'అమ్మా, నాన్నా' అని పిలిచే సందీప్‌నీ, వాడి ముద్దు మాటల్నీ, చేష్టల్నీ ఒకరి తర్వాత ఒకరు పోటీపడి చెప్పే అమ్మనీ, మానసనీ చూస్తూంటే వేయి జన్మలకు సరిపడే 'రిలీఫ్' లభించింది.

నిజంగా మానసలో మార్పు తెచ్చిన ఆ ఉత్తరం ఇప్పటికీ నా గుండెలో పదిలంగా దాచుకున్నానంటే నాకే ఆశ్చర్యంగా ఉంది. నా ఆలోచనలు నాకు తెలీకుండానే గతంలోకి పరుగులు తీశాయి.

★ ★ ★

ఏడ్చుకుంటూ లోపలికి వచ్చిన మానసను చూసి పార్వతమ్మ "అమ్మా, మానసా ఎందుకేడుస్తున్నావు? ఏమైంది చెప్పు" అంటూ గడ్డం పట్టుకొని బ్రతిమాలుతోంది!

'అత్తయ్యా! నేను వెళ్ళనంటే శ్యామల వాళ్ళ బాబు పుట్టిన రోజు పండక్కి వెళ్ళమన్నారు. వెళ్ళాను కదా! నేను ప్రజెంటేషన్ ఇస్తూంటే శ్యామల వాళ్ళక్క అమ్మా- మానసా! నువ్వు ఇవ్వమాకు తల్లీ! అసలే శ్యామలకు లేక లేక పుట్టిన కొడుకు, నువ్వేమో గొడ్రాలివి నీ చేతులతో ఇస్తే ఏమన్నా అయ్యేను! అంది అత్తయ్యా! చెప్పత్తయ్యా! పిల్లలు లేకపోతే అది నేరమా? దానికి నేనేం జేయాలి? ఎవరుచూసినా ప్రత్యక్షంగా, పరోక్షంగా నన్ను హేళన చేస్తున్నారు. నేను బ్రతక్కూడదు. చచ్చిపోతాను' అంటూ పార్వతమ్మను గట్టిగా పట్టుకొని ఏడుస్తోన్న మానసను...

'ఊరుకో మానసా నేను గానీ, రాజేష్‌గాని నిన్ను ఏమన్నా అన్నామా? చెప్పు! బయటివాళ్ళు ఏదో ఒకటి అంటూ ఉంటారూ పట్టించుకోకూడదు! మేమేమన్నా అంటే బాధపడాలి అయినా మాకు లేని బాధ వాళ్ళకేంటి? దా వచ్చి అన్నం తిను' అంటూ పార్వతమ్మ ఓదార్పుగా పిలిచింది.

'వద్దత్తయ్యా, నాకు తలనొప్పిగా ఉంది. పడుకుంటాను' అంది మానస.

'సరే! పడుకో పో! పిచ్చిపిచ్చిగా ఆలోచించకు' అంది పార్వతమ్మ.

'మానసా! గదిలో లైటు లేకుండా పడుకున్నావేంటి?' అని లైట్ వేసిన రాజేష్ ఏడుస్తోన్న మానసను చూసి.

'అరే! ఏమైంది? ఎందుకేడుస్తున్నావ్?' రాజేష్ మాటలకి కన్నీళ్ళు ఉబికి వచ్చాయి మానసకి.

'మానసా, నువ్వేదైనా పార్టీకి వెళ్తే నిన్నెవరేమన్నా అన్నారా?' అని రాజేష్ అడగడంతో.

'నేను గొడ్రాలినని...' మిగతా మాటలు చెప్పలేక వెక్కి వెక్కి ఏడ్చింది.

'దానికే ఇంత బాధపడిపోతున్నావా? మానసా మన పెళ్ళయి పదేళ్ళయింది. ప్రతిసారీ నువ్వు బాధపడ్తూ ఈ విధంగా ఏడుస్తూంటే నేనేం చేయాలి చెప్పు. అన్ని ప్రయత్నాలూ చేశాం, ఫలితం లేదు దానికి ఎవరో అన్నారని ఏడిస్తే ఎలా? బయట వాళ్ళ మాటలుపట్టించుకొని ఏడుస్తావెందుకు? నేనూ, అమ్మా నిన్ను ఇంత ప్రేమగా చూసుకున్నా నువ్వు బాధ పడ్తున్నావంటే... మా ప్రేమలోనే ఏదో లోపముండాలి, అవునా?' అడిగాడు రాజేష్.

"పిల్లలు కావాలనే ఆ కోర్కెను చంపుకోలేక..."

'పిచ్చి మానసా! పిల్లలు లేకపోతే ఏమైంది? చెప్పు. పిల్లలు లేరని జీవితాంతం ఇలా బాధపడ్తూంటే మీ



అమ్మా, నాన్నా, మా అమ్మా, నాన్నా ఎంత బాధపడ్తారో ఆలోచించావా? లే- లేచి ముఖం కడుక్కో అన్నం తిందాం' అంటూ తొందరపెట్టాడు రాజేష్.

రాజేష్ ఎన్ని విధాల ప్రయత్నించినా ఆమె బాధ పోగొట్టలేకపోతున్నాడు. ఒకరోజు పక్కింటామె వాళ్ళ పిల్లాడి కబుర్లు చెప్తుంటే ఆసక్తిగా వింటోన్న మానస కళ్ళలో నీళ్ళు కన్పించాయి! ఆమె వెళ్ళిపోయాక 'మానసా! నిజంగా నీకు పిల్లలు కావాలా?' అని సీరియస్‌గా అడిగాడు.

'అవునండీ! నిజంగా కావాలి'

"అయితే ఎవరన్నా అనాథను పెంచుకుందాం. ఇద్దరం కలిసి మన పిల్లగా పెంచుకుందాం. అమ్మ కూడా ఒప్పుకుంది. ఏమంటావు?' అని రాజేష్ సంకోచంగా ముఖం పెట్టి మానస కళ్ళలోకి చూశాడు.

'ఛీ! అనాథ పిల్లనా? తల్లెవరో? తండ్రెవరో? అయినా నాకు అనాథ పిల్లలంటే ఇష్టం లేదు. వాళ్ళు మన పిల్లలెలా అవుతారు? ఈ పాడు ఆలోచన మీకెలా వచ్చింది?' అంటూ మానస కటువుగా అంది.

'మానసా! అనాథలంటే నీకెందుకంత చులకన? వాళ్ళు మాత్రం మనుషులు కాదా? వాళ్ళ తల్లిదండ్రులు కనిపడేసిన దానికి పిల్లలెలా బాధ్యులు?' అని మానసని ఓరగంట చూస్తూ అడిగాడు రాజేష్.

'ఎవరో పిల్లల మీద మనకెలా ప్రేమ పుడ్తుంది? మనసెలా ఒప్పుతుంది? నేను మాత్రం అనాథ పిల్లని తెచ్చుకోలేను, పెంచుకోలేను అంది మానస జవాబుగా.

'ఎందుకు పెంచలేవు?!' చిన్నప్పటి నుండి పెంచుతూ ఉంటే అదే ప్రేమ వస్తుంది' అని ప్రశ్నార్థకంగా చూశాడు రాజేష్.

ఏమైనా చెప్పండి! ఎవరో అడ్డమైన పిల్లను తెచ్చి పెంచుకోలేను' అంది మానస గట్టిగానే.

'సరే! మానసా ఆలోచించుకో. నీ మనసు బాగోలేదు, మీ అమ్మా వాళ్ళ దగ్గరికి వెళతావా? అన్నాడు రాజేష్ ఇక ఆ సంభాషణను ఏదో రకంగా ఆపెయ్యాలని.

'సరేనండీ! రేపు వెళ్తాను. కాని అత్తయ్య ఒక్కతే ఉంటుంది' అంది మానస మెల్లగా.

'నేను ఉంటానుగా అమ్మకు తోడు నువ్వెళ్ళు. మీ అమ్మ దగ్గరుంటే నీక్కాస్త మార్పుంటుంది' అన్నాడు రాజేష్.

మానస వెళ్ళి నెలరోజులయింది ఇంకా రాలేదు. మామ గారి దగ్గర నుండి లెటర్ వచ్చింది.

బాబూ రాజేష్!

మానస ఇక్కడ ఏమంత సంతోషంగా లేదు. ఎప్పుడూ పిల్లల బొమ్మలు చూస్తూ కూర్చుంటుంది. మా పని మనిషి రంగి పిల్లాణ్ణి కని చనిపోయింది. 'పోనీ ఆ పిల్లాడిని పెంచుకో' అన్నాను. ససేమిరా ఒప్పుకోలేదు.

"ఛీ ఆ పని మనిషి పిల్లాడినా పెంచుకొనేది" అని ఛీత్కారం చేసింది. ఏం చేయాలో మాకు తోచడం లేదు. అనాథలను ఇంతగా అసహ్యించుకునే మానసకు తానే ఒక అనాథ అని తెలిస్తే ఎలా ఉంటుందో?

మాకు పిల్లలు లేక ఓ అనాథ పిల్లను, మా పిల్లగా, పెంచుకొని 'మానస'ను పెంచుకొని 'మానస' అని పేరుపెట్టి అల్లారు ముద్దుగా చూసుకున్నామని తెలిస్తే మమ్మల్ని క్షమించదు.

తాను ఒక అనాథని తెలిస్తే తనకు తానే ఏ శిక్ష విధించుకుంటుందో తెలీదు. మేమేనాడు అది అనాథ అని తెలీనివ్వలేదు. కన్నబిడ్డ కంటే ఎక్కువగా చూసుకున్నాం. కాని దానికి ఎలా వచ్చిందో అనాథలను అసహ్యించుకునే గుణం?

కాలమే దానిలో మార్పు తేవాలి. అంత వరకూ మనం ఎదురు చూస్తూ ఉండాల్సిందే.

మీ

మామయ్య.

లెటరంతా చదివిన రాజేష్‌కు ఏంచేయాలో బోధ పడలేదు.

'మానసని ఏ విధంగా మార్చాలి? నాకు అంతు బట్టడం లేదు. పాపం! మామగారూ, అత్తగారూ ఈ విషయంలో ఎంత బాధపడ్తున్నారో?!' అనుకుంటూ రాజేష్ ఉత్తరం గూర్చి పార్వతమ్మకు చెప్పాడు.

ఆమె కూడా కాసేపు బాధపడింది.

ఆరోజు రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చేటప్పటికి.

'రాజేష్! మానస వచ్చి మళ్ళీ వెళ్ళిందిరా. రేపు వస్తానంది. ఎందుకో తొందరగా వెళ్ళింది. నీకు ఈ లెటర్ ఇవ్వమంది' అంటూ పార్వతమ్మ రాజేష్‌కు ఓ లెటరిచ్చింది.

డియర్ రాజేష్,

'నేను ఇంటికి వచ్చి బీరువా సర్దుతుంటే మా నాన్న మీకు రాసిన లెటర్ కనబడ్డది ఆ లెటర్ చదివాను. నేనెవరో నాకు తెలిశాక చాలా సిగ్గుపడ్డాను-బాధపడ్డాను.

నేను ఒక అనాథనని తెలిసి నన్ను పెళ్ళి చేసుకున్న మీరు, కన్న బిడ్డలాగా చూసుకున్న అత్తయ్య,స్వంత బిడ్డలాగా ప్రేమతో పెంచుకున్న అమ్మ, నాన్నా అందరూ ఎంతో గొప్పవారు.

మీ అందరికంటే గొప్ప దాన్నా నేను? నాకు అనాథలంటే చులకన భావం ఈరోజుతో పోయింది అందుకనే జీవితంలో ఎప్పుడూ ఎవర్నీ అసహ్యించుకో కూడదు.

నేను ఇన్ని రోజులు ఎంత మూర్ఖంగా ఆలోచించానో ఈరోజే తెలిసింది. నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి. నేను మా పని మనిషి రంగి కొడుకును తేవడానికి వెళ్తున్నాను వాడిని నా కన్న కొడుకులాగా పెంచుకుంటాను.

అనాథలపై ఏర్పరచుకున్న చులకన భావానికి స్వస్తి చెప్తున్నాను. నా కొడుకు కాని కొడుకును తీసుకొని రేపు సాయంత్రం 6 గంటలకు వస్తాను. నా కోసం మీ కొడుకు కోసం స్టేషన్‌కు వస్తారుగా.


-మీ ప్రియమైన

మానస.

ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివాడో రాజేష్‌కు తెలీదు. అమ్మా కొడుకుల సంతోషం అంతా ఇంతాగాదు. పార్వతమ్మ మనవడికోసం ఇల్లంతా శుభ్రపరచి అలంకరించింది. సాయంత్రం 6 గంటలకు రాజేష్ స్టేషన్‌కు వెళ్ళాడు. బస్సు కోసం చూస్తోన్న రాజేష్‌కి రాజేష్ - అన్న పిలుపు వినబడింది.

సంతోషంతో ఉప్పొంగిపోతున్న మానస, మానస చేతుల్లో ముద్దులు మూట కడ్తోన్న చిన్నారి బాబునుచూసి రాజేష్ మైమరచిపోయాడు.

'నిజంగా ఈ ఆడవాళ్ళకి ప్రేమొచ్చినా, కోపమొచ్చినా దాచుకోలేరు గదా!' అనుకున్నాడు రాజేష్.★




బి. ఉమా భాస్కర్, డిఎన్ఎస్ఎఫ్‌సి స్టోర్స్, ఎల్.పి.జి.వింగ్, శక్కర్‌నగర్, బోధన్.